



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
డిసెంబర్ 22, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 10 | వెల 4/-


## గిరిజన యువత తలుచుకుంటేనే
# మార్పు సాధ్యం



సర్పంచ్‌లు తల ఎత్తుకుని తిరిగే పరిస్థితులు

డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని

రూ.105 కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం

రెండోరోజూ గిరిజన గ్రామాల్లో పవన్ పర్యటన

విజయనగరంద: ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ భాగస్వామి అయ్యాడంటే.. ప్రతీ గిరిజన యువకుడు ప్రభుత్వంలో వున్నట్టే లెక్క అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇక్కడ ప్రజల ఆవేదన, బాధ తెలుసుకోవడం కోసమే అటవీ ప్రాంతంలో పర్యటించామన్నారు. రూ.105 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోసమో, ఓట్ల కోసం మా ప్రభుత్వం పనిచేయదని.. ప్రజల కష్టాలు, కన్నీళ్లలో మేం వున్నామని కచ్చితంగా చెబుతున్నామన్నారు. 19 పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మంతి పర్యటనలో గిరిజనుల సమస్యను పవన్

2లో

## బాధిత కుటుంబాన్ని
# పరామర్శించలేదేం!

### హీరో ఇంటికి క్యూ కట్టిన సినీ ప్రముఖులు..

### హీరో, నిర్మాత.. ఎవరూ పిల్లాడి దగ్గరకు పోలేదు

పోలీసులు రావద్దని చెప్పినా థియేటర్‌కు హీరో

అభిమానులు తోసుకొచ్చారు.. బాడీ గార్డ్స్ నెట్టారు

తొక్కిసలాటలో మహిళ మృతి.. కోమాలో బాలుడు

అయినా థియేటర్ నుంచి వెళ్లేందుకు హీరో ససేమిరా

అరెస్టు చేస్తామని హెచ్చరించి డీసీపీ పంపించారు

మానవత్వం లేని ఇలాంటి వాళ్లను అరెస్టు చేస్తే..

నీచమైన భాషతో ప్రభుత్వాన్ని బద్నాం చేసే యత్నం

పదేళ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి

సోషల్ మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారు

ప్రాణాలు పోయినా ఏమీ అనొద్దనడం న్యాయమా?

సినిమాలు తీసుకోండి.. వ్యాపారం చేసుకోండి..

ప్రాణాలు పోతే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు

సినీ పరిశ్రమకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక



2లో

హైదరాబాద్: "ఒక్కపూట జైలుకు వెళ్లి వచ్చిన హీరో ఇంటికి సినీ ప్రముఖులంతా క్యూ కట్టారు. ఆయనకు ప్రమాదం జరిగిందా? ఏమైనా జబ్బు పడ్డారా? హీరోను పరామర్శించేందుకు క్యూ కట్టిన సినీ ప్రముఖుల్లో ఒక్కరైనా బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు!?



## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూ భారతి చట్టం మాకు రెఫరెండం

ఈ చట్టం మాకు శ్రీ రామరక్ష

ధరణితో పోయిన భూములు భూభారతితో హక్కుదారుల సొంతం

మండలిలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 21 : ఎన్నో సమావేశాలు, చర్చలు, సంప్రదింపుల తర్వాతే భూ భారతి చట్టాన్ని రూపొందించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నాలుగేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పనితీరుకు భూ భారతి రెఫరెండంగా నిలుస్తుందన్నారు. మండలిలో భూ భారతి బిల్లుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడారు. భూ భారతి చట్టం

(మిగతా 2వ పేజీలో)

# రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం

ఆదాయపు పన్ను కడితే సాయం చేయరా?

పథకంపై ఇచ్చిన నివేదికను సభలో పెట్టండి

ఏ ఊరిలోనూ 100% రుణమాఫీ కాలేదు

24 గంటల కరెంట్ ఎక్కడా ఇవ్వడం లేదు

తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తాం

భూములన్నింటికీ రైతుబంధు ఇవ్వడం వల్లే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది

ఎన్ని కేసులు పెట్టినా భయపడం: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 21 : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ఆదాయపు పన్ను చెల్లించేవారికి, ఉద్యోగం చేస్తున్నవారికి, పాన్ కార్డులు ఉన్నవారికీ రైతు భరోసా ఇవ్వొద్దని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని, ఇది సరైంది కాదన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి మందికిపైగా పాన్ కార్డులు ఉన్నాయని, వీరిలో రైతులు కూడా ఉన్నారని చెప్పారు. రైతుల పిల్లల్లో కొందరు ఉద్యోగం చేస్తున్నవారు ఉన్నారని, అలాంటి రైతులకూ రైతుభరోసా ఇవ్వబోమంటే ఎలా అని ప్రశ్నించారు. శనివారం శాసనసభలో రైతు భరోసా పథకంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. రైతుబంధు (రైతు భరోసా)ను

(మిగతా 2వ పేజీలో)



## ఇకపై నో బెనిఫిట్ షోస్

సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సందేశాత్మక, తెలంగాణ చరిత్రపై సినిమాలకే నామమాత్రంగా టికెట్ రేట్లు పెంచుతాం

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడ్డ బాలుడికి పరామర్శ

తన సొంత ఫౌండేషన్ నుంచి బాలుడి తండ్రికి రూ. 25 లక్షల చెక్కు అందజేత

రాంగోపాల్‌పేట్: తెలంగాణలో ఇకపై ఎంత పెద్ద బడ్జెట్‌తో రూపొందించే సినిమాలకైనా బెనిఫిట్ షోలను అనుమతించబోమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. అలాగే టికెట్ రేట్ల పెంపుపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సందేశాత్మక చిత్రాలతోపాటు తెలంగాణ పోరాటం, ఉద్యమం, చారిత్రక అంశాలపై రూపొందించే సినిమాలకు నామమాత్రంగా

(మిగతా 2వ పేజీలో)

# టోల్ రుసుము శాశ్వతం కాదు



నిరంతరం వసూళ్లంటే నిరంకుశత్వమే

ప్రాజెక్టులు ప్రజల ప్రయోజనం కోసం..

ప్రయివేటు వ్యక్తుల ఆర్జనల కోసం కాదు

లాభాలొచ్చినా ఇంకా రుసుములేంటి?

అధికార్లు నిజాయతీగా ఉండాలి: సుప్రీం

నోయిడా ఫ్లై వేపై టోల్ రద్దుకు సమర్థన

# ప్రపంచానికే నైపుణ్య రాజధాని భారత్!



భారతీయుల శ్రమశక్తి, నైపుణ్యాలు నవ కువైత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయని..

కువైత్‌లో ప్రవాసభారతీయులతో మోదీ.. నేడు ఆ దేశరాజు, ప్రధానితో సమావేశం

కువైత్ సిటీ, డిసెంబరు 21: భారతీయుల శ్రమశక్తి, నైపుణ్యాలు నవ కువైత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయని.. ప్రపంచానికే నైపుణ్య రాజధాని అయ్యే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ అన్నారు. రానున్న కొన్ని దశాబ్దాలపాటు ప్రపంచంలోనే అత్యంత యువ దేశంగా భారత్ ఉంటుందని పేర్కొన్నారు. కువైత్ రాజు షేక్ మిషాల్ అల్ అహ్మద్ అల్ జుబేర్ అల్ సబహ్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైత్‌కు చేరుకున్న ప్రధాని.. ఇక్కడి 'షేక్ సాద్ అల్ అబ్దుల్లా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్'లో

(మిగతా 2వ పేజీలో)




## స్పోకెన్ ఇంగ్లీష్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేత

### విద్యార్థులు తమకు నైపుణ్యం ఉన్న రంగంలో రాణించాలి: ప్రిన్సిపల్ పి శ్రీధర్

వార్త మిర్రర్, మల్కాజిగిరి: విద్యార్థులు చదువుతోపాటు తమకు నైపుణ్యం ఉన్న రంగంలో రాణించినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఫ్రోబెల్స్ గార్డెన్ పాఠశాల ప్రిన్సిపల్ పి శ్రీధర్ పేర్కొన్నారు. ఫ్రోబెల్స్ గార్డెన్ పాఠశాల వ్యవస్థాపకులు పురం శెట్టి యాదగిరి జ్ఞాపకార్థం పాఠశాలలో డిసెంబర్ 20వ తేదీన ఫౌండర్స్ డే నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాల ఫౌండర్, తమ తండ్రి పురంశెట్టి యాదగిరి ఇంగ్లీష్ టీచరని అతని జ్ఞాపకార్థం ప్రతి ఏటా పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ ఏడాది స్పోకెన్ ఇంగ్లీష్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సెకండ్ క్లాస్ ఏ వన్ తరగతికి చెందిన బద్దుల దివ్యాంక యాదవ్, డి రిషిక కు ప్రిన్సిపల్ శ్రీధర్ బహుమతి అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జన సైనికుడు కుటుంబానికి 5 లక్షల రూపాయలు భీమా చెక్కు

### బీమా చెక్కును అందజేస్తున్న నేమూరి శంకర్ గౌడ్, పర్నె శివారెడ్డి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : ప్రతి జన సైనికుడికి వీర మహిళలకు భరోసా కల్పించడమే ధ్యేయంగా జనసేన పార్టీ నాయకులు పర్నె శివారెడ్డి మునుగోడు నియోజకవర్గం లో 300 పైగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేశారు. జనసేన క్రియాశీలక సభ్యులు సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన గంగాపురం వెంకటేశం కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులు గంగాపురం మౌనిక కి రూ.5 లక్షల రూపాయల బీమా చెక్కు అందించేలా కృషి చేశారు. జనసేన పార్టీ తెలంగాణా రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్ ఈరోజు మధ్యాహ్నం హైద్రాబాద్ లోని కేంద్ర పార్టీ కార్యాలయం లో ఈ భీమ చెక్కు ను అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్,రాధ రాజలింగం, కావ్య, నియోజకవర్గ నాయకులు రవీందర్ రెడ్డి , పర్నే శివారెడ్డి, తోర్పునూరి లింగస్వామి గౌడ్ మెగావత్ రాజు నాయక్. తదితరులు పాల్గొనడం జరిగింది

# సినిమా వాళ్లు స్పెషలా?: సీఎం రేవంత్

విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అతిగా స్పందించిందన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. ఒక మహిళ చనిపోగా, ఒక బాలుడు కోమాలో, మరొకరు తొక్కిసలాటలో ఇరుక్కుపోతే.. ఆ హీరో కనీసం పట్టించుకోకుండా అభిమానులకు చేతులు ఊపుతూ వెళ్లడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?"అని పేర్కొన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

"ఈ అంశం సభలో చర్చకు వస్తుందని అనుకోలేదు. డిసెంబర్ 4న పుష్ప%–%2 విడుదల సందర్భంగా హీరో, హీరోయిన్ వస్తారని బందోబస్తు కల్పించాలని డిసెంబర్ 2న సంధ్య టాకీస్ వాళ్లు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేశారు. ఆ ప్రాంతంలో రద్దీతోపాటు సంధ్య థియేటర్‌లోకి వెళ్లడానికి, బయటికి రావడానికి ఒకే గేటు ఉన్న కారణంగా సెక్యూరిటీ కల్పించలేమని అనుమతి నిరాకరిస్తూ 3న అక్కడి సీఐ సమాధానమిచ్చారు. అయినా 4న రాత్రి 9 గంటల ప్రాంతంలో అల్లు అర్జున్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మీదుగా తన కారు రూఫ్‌టాప్ ఓపెన్ చేసి రోడ్‌షో నిర్వహిస్తూ థియేటర్‌కు వచ్చారు. తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఉన్న ఆ ప్రాంతంలో వేలమంది ఒకచోట చేరడంతో పరిస్థితి అదుపు తప్పింది. అల్లు అర్జున్ 50, 60 మంది ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డుగా ఉన్న వారిని తోసేయడం తొక్కిసలాటకు దారితీసింది. రేవతి అనే మహిళ, శ్రీతేజ్ అనే బాలుడు స్పృహ తప్పినట్టుగా పోలీసులు గుర్తించారు. అప్పటికే రేవతి మరణించగా, శ్రీతేజ్ బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు ప్రకటించారు.

### పోలీసులు చెప్పినా పట్టించుకోలేదు

ఏసీపీ ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో సంధ్య థియేటర్‌కు వెళ్లి పరిస్థితి బాగో లేదని.. హీరోను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరినా పూర్తి సినిమా చూస్తానంటూ ఆయన పట్టించుకోలేదు. తర్వాత డీసీపీ వెళ్లారు. వెంటనే వెళ్లిపోకపోతే అరెస్ట్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో బయటికి వచ్చారు. ఇంత ప్రమాదం జరిగి, ఒకరు చనిపోయాక కూడా హీరో కారు రూఫ్‌టాప్ ఓపెన్ చేసి అభిమానులకు చెయ్యి ఊపుతూ వెళ్లారంటే... ఆయన ఎలాంటి మనిషి అనుకోవాలి? నేను సీఎం కుర్చీలో కూర్చుని మౌనంగా ఉండలేను.

### ఇంటికెళ్లిన పోలీసులతో దురుసుగా..

తొక్కిసలాట ఘటనపై పోలీసులు కేసు పెట్టారు. కొందరిని అరెస్ట్ చేశారు. కొన్నిరోజుల తర్వాత హీరో నివాసానికి కూడా వెళ్లి తమ వెంట రావాల్సిందిగా కోరారు. కానీ పోలీసులపై వారు దురుసుగా ప్రవర్తించారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయి. ఆ హీరోను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లగానే... నా రాజకీయ మిత్రుల కోసం కేసు పెట్టానంటూ సోషల్ మీడియాలో కొన్ని రాజకీయపార్టీల వారు నన్ను పైశాచికంగా, నీచంగా తిడుతూ పోస్టులు పెట్టారు.

### బాధితులను కనీసం పరామర్శించలేదు

శ్రీతేజ్ తండ్రి నెలకు రూ.30 వేలు సంపాదించే మామూలు ఉద్యోగి. కొడుకు ఆ హీరో అభిమాని కావడంతో.. స్పెషల్ షో కోసం ఒక్కో టికెట్‌కు రూ.మూడేసి వేల చొప్పున రూ.12 వేలు పెట్టి కొన్నారు. తల్లి రేవతి చనిపోయి, అబ్బాయి తీవ్ర అస్వస్థతకు గురై 11 రోజులు గడిచినా ఆ కుటుంబ సభ్యులను హీరో, ప్రొడ్యూసర్, మరెవరూ పరామర్శించలేదు. ఇది ఏరకమైన మానవత్వం? ఇలా వ్యవహరించే వారిని ఏమనాలి? విధి నిర్వహణలో భాగంగా హీరోను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళితే.. పదేళ్లు మంత్రిగా ఉన్న ఓ వ్యక్తి, ఉద్యమాల టైంలో షూటింగ్‌లు జరపొద్దంటూ దాడులు చేసిన వ్యక్తి విమర్శలు చేస్తారు. ఈ హీరో భగవత్ స్వరూపుడు, ఆయనను పోలీసులు ముట్టుకుంటారా? అసలేం జరుగుతోంది? అంటారు. అంటే మీ స్నేహితులైతే అరెస్ట్ చేయొద్దా? వారేం చేసినా మాఫీనా?

### ప్రత్యేక రాయితీలిచ్చింది మా సర్కారే కదా!

సినీ పరిశ్రమను ప్రోత్సాహించాలని ఆ సినిమాకు టికెట్ రేట్ల పెంపు, స్పెషల్ షోలకు అనుమతినిచ్చింది మా ప్రభుత్వమే. అయితే ఇలా ప్రోత్సహించే క్రమంలో ప్రాణాలు తీసే ఘటనలు జరిగినా ఏమీ చేయకూడదంటే ఎలా? అంటే ఫిల్మ్‌స్టార్, సూపర్‌స్టార్, రాజకీయ ప్రముఖులు ఎవరినైనా హత్యచేసినా... వారిని ప్రాసిక్యూట్ చేయొద్దని ఏదైనా ప్రత్యేక చట్టం ఉంటే చెప్పండి పాటిస్తాం.

### సినీ ప్రముఖులను సూటిగా అడుగుతున్నా..

తల్లి చనిపోయింది, పిల్లవాడు బ్రెయిన్‌డెడ్ అయ్యి కోమాలో ఉంటే ఒక్కరైనా వెళ్లారా? సినీ ప్రముఖులను సూటిగా అడుగుతున్నా.. ఆ సినీ హీరోకు ఏమైంది కాలు పోయిందా? చెయ్యి పోయిందా? కన్ను పోయిందా? కిడ్నీలు దెబ్బతిన్నాయా? ఏమైంది.. వెళ్లి పరామర్శించడానికి.. అదే చావుబతుకుల్లో ఉన్న పిల్లవాడిని ఒక్కరూ పరామర్శించలేదు. ఇది సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి.

### హీరో అయితే అర్ధరాత్రి జైలు నుంచి వదిలిపెట్టాలా?

హీరోకు హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఆయనను అర్ధరాత్రి 11, 12 గంటలకు విడుదల చేయాలని చాలా మంది గట్టిగా కోరారు. అర్ధరాత్రి జైలు నుంచి వదిలేందుకు చట్టంలో ఏదైనా వెసులుబాటు ఉందా? సినీహీరో కాబట్టి అర్ధరాత్రి వదిలిపెట్టాలంటే ఎలా? కొన్ని రాజకీయ పార్టీల నేతలు, పదేళ్లు మంత్రిగా ఉన్న వారు ఆ హీరోపై కేసు పెట్టడాన్ని తప్పుబడుతున్నారు. హీరో కాబట్టి ఏం చేసినా చెల్లుతుందా? మేం అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి అనుగుణంగా చట్టం, న్యాయం ప్రకారం నడిపిస్తాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు: అల్లు అర్జున్

నాకు గుడి లాంటిది. అక్కడ ప్రమాదం జరగడం నాకు చాలా బాధగా ఉంది. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఆ ఘటన తర్వాత నిర్మాత బన్నీ వాసు వెళ్లి బాధిత కుటుంబంతో మాట్లాడారు. నేను కూడా వస్తానంటే ఉద్రిక్త పరిస్థితులు ఉన్నందున మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని చెప్పి వారించారు. నాపై పోలీసులు కేసు నమోదు చేసినందున బాధిత కుటుంబాన్ని కలిస్తే చట్టపరంగా తప్పుడు సంకేతాలు వస్తాయని లీగల్ టీం సైతం గట్టిగా చెప్పడం వల్లే అక్కడికి వెళ్లలేకపోయా'అని అల్లు అర్జున్ తెలిపారు.

### నా అభిమాని చనిపోతే వెళ్లాలని నాకు ఉండదా?

తొక్కిసలాట ఘటనలో ఒకరి మృతితో 15 రోజులుగా బాధలో ఉన్నానని అల్లు అర్జున్ చెప్పారు. ఈ నేపథ్యంలో సినిమా విజయోత్సవాలను నిర్వహించరాదని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 'గతంలో మెగాస్టార్ చిరంజీవితోపాటు పలువురు హీరోల అభిమానులు చనిపోతే విజయవాడ, వైజాగ్ లాంటి ప్రాంతాలకు వెళ్లి పరామర్శించా. అలాంటిది నా అభిమాని చనిపోతే వెళ్లనా? పరామర్శించాలని నాకు ఉండదా?'అని అల్లు అర్జున్ ప్రశ్నించారు. ఘటన జరిగిన మర్నాడే బాధిత కుటుంబాన్ని కలవాలనుకున్నప్పటికీ తన లీగల్ టీం సూచనల వల్ల వెళ్లలేకపోయానన్నారు.

### అనుమతి లేకపోతే పోలీసులు వెనక్కి పంపేవారు కదా..

థియేటర్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనను అత్యంత దురదృష్టకరమైన ప్రమాదంగా హీరో అల్లు అర్జున్ అభివర్ణించారు. సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు పోలిసులు అక్కడ ఉన్నారని... దాంతో తన రాకకు అనుమతి ఉందనే భావించినట్లు ఆయన చెప్పారు. తాను లోపలికి వెళ్లేందుకు వీలుగా తన వాహనాలకు దారి చూపింది పోలిసులేనని.. ఒకవేళ తన రాకకు పోలీసుల అనుమతి లేకుంటే వారు అప్పుడే వెనక్కి పంపేవారు కదా? అని అల్లు అర్జున్ ప్రశ్నించారు.

### రోడ్ షో అనడం దారుణం

థియేటర్‌కు రోడ్ షో, ర్యాలీ చేసుకుంటూ వెళ్లాననే మాట పూర్తిగా అవాస్తవం, దారుణమని అల్లు అర్జున్ వ్యాఖ్యానించారు. థియేటర్‌కు కేవలం కొన్ని మీటర్ల దూరంలో ఉండగా భారీ సంఖ్యలో అభిమానులు తన వాహనాన్ని చుట్టుముట్టారని చెప్పారు. తాను కారులో నుంచి పైకి వచ్చి అభివాదం చేస్తే అభిమానులు పక్కకు జరుగుతారని అక్కడి వారు చెబితే తాను బయటకు వచ్చానని వివరించారు. తనను ఒక్కసారైనా చూసేందుకు అంత మంది అభిమానులు వచ్చినప్పుడు తాను కారులోనే కూర్చుంటే తనకు తల పొగరు అనుకుంటారని భావించే వారికి నమస్కరిస్తూ దారివ్వాలని కోరానన్నారు.

### మహిళ మృతి గురించి పోలీసులు చెప్పలేదు..

తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందిందని పోలిసులు తనకు చెప్పలేదని అల్లు అర్జున్ చెప్పారు. కేవలం థియేటర్ యాజమాన్యం తన వద్దకు వచ్చి బయట గొడవగా ఉన్నందున వెళ్లిపోవాలని సూచించారన్నారు. దీంతో వెంటనే తాను భార్యతో కలిసి బయటకు వెళ్లిపోయానని వివరించారు. తన పిల్లల్ని లోపలే వదిలి వెళ్లానని.. ఒకవేళ జరిగిన దుర్ఘటన



గురించి తెలిస్తే వారిని వదిలిపెట్టి ఎందుకు వెళ్తానని ప్రశ్నించారు. ఈ విషయం మరుసటి రోజు ఉదయం తెలిసి షాక్‌కు గురయ్యానన్నారు. ఆ తర్వాత బాధిత కుటుంబానికి అండగా ఉన్నాననే విషయాన్ని తెలియజేసేందుకే వీడియో విడుదల చేశానన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు శ్రీతేజ్ కోలుకుంటున్నాడని తెలియడం ఒక్కటే ప్రస్తుతం తనకు ఊరట కలిగించే అంశమన్నారు. తాను వెళ్లడం సమస్యగా మారుతుందనే ఉద్దేశంతోనే తన తండ్రి అల్లు అరవింద్‌ను ప్రత్యేక అనుమతి ద్వారా ఆస్పత్రికి పంపి బాలుడి చికిత్స వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని అల్లు అర్జున్ వివరించారు. తాను, దర్శకుడు సుకుమార్ కలిసి పిల్లల భవిష్యత్తు కోసం కచ్చితంగా ఏదైనా మంచి పని చేయాలని అవసరమైతే వారి పేరిట ఫిక్స్ డిపాజిట్ చేయాలని చర్చించుకున్నట్లు చెప్పారు.

### ఎవరినీ నిందించట్లేదు..

తాను ఎవరినీ నిందించాలని మాట్లాడటం లేదని.. తనకు ఎవరిపైనా వ్యక్తిగత కోపం లేదని అల్లు అర్జున్ చెప్పారు. ప్రభుత్వం తమ సినిమాకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించిందని.. అందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అదే సమయంలో తనను మానవత్వం లేని వ్యక్తిగా చిత్రీకరించే పరిస్థితి ఎదురవడం అత్యంత బాధాకరంగా ఉందన్నారు. కేసు విచారణ దశలో ఉన్నందున మీడియా ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేనని అల్లు అర్జున్ పేర్కొన్నారు.

### మా కుటుంబం గురించి అందరికీ తెలుసు: అల్లు అరవింద్

పాన్ ఇండియా మూవీగా వచ్చిన సినిమాను ప్రేక్షకులతో కలిసి థియేటర్లో చూసుకుందామనే ఉద్దేశంతోనే అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వెళ్లాడని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. థియేటర్ వద్ద ఘటన తర్వాత మనస్తాపానికి గురై అదే ఆలోచనలతో ఉండిపోయాడన్నారు. మూడు తరాల చరిత్రగల తమ కుటుంబం గురించి అందరికీ తెలుసన్నారు. అసత్య ప్రచారాల వల్ల బాధలో ఉన్నందున మనసులోని ఆవేదనను చెప్పుకుంటున్నామన్నారు. ప్రజలు ఆదరిస్తేనే ఈ స్థాయికి వచ్చామని.. అభిమానాన్ని ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు.



## కీ.శే పాక పెద్ద జంగయ్య దశదిన కార్యక్రమానికి హాజరైన- మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన కీ.శే పాక పెద్ద జంగయ్య గారి దశదినకర్మ కార్యక్రమానికి హజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ,గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి, వారితో పాటు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు రాచకొండ రవీంద్ర చారి,కొండ గిరి గౌడ్,పాశం కృష్ణ యాదవ్ ,గ్రామశాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం,ఉప్పల శ్రీనివాస్,చిలువేరు శంకర్ ,చిలువేరు వెంకులు,విక్రమ్,జీ.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్వాస మీద ధ్యాసే ధ్యానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 21 : అలసిన మనసు కన్నా ప్రశాంతత ఉన్న మనసు చురుకుగా పని చేస్తుందని ఓషో ధ్యాన మగ్నో అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల శివారులో గల నివేదిత కృష్ణారావు పిరమిడ్ క్షేత్రంలో ఓషో ధ్యాన మాగ్నో ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా ఓషో ధ్యాన పద్ధతులను పరిచయం చేస్తూ ఒకరోజు ధ్యాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన శిక్షకులు మాగ్నో మాట్లాడుతూ... ప్రతి రోజు కొన్ని నిమిషాలైనా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తే అది మనం కోరుకున్న విధంగా మనల్ని మనం మలుచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. రోజులో అరగంట పాటైన ధ్యానం చేయడం శ్రేయస్కరమన్నారు. శ్వాస మీద ధ్యాసే ధ్యానమని, ధ్యానం చేయడం ద్వారానే ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతులుగా ఉంటారని అన్నారు. ధ్యానం వ్యక్తిగత వికాసానికి తోడ్పడే ఏకైక సాధనమని ఓషో ధ్యాన పద్ధతులు ఇందుకు తోడ్పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, అనుపురం నాగేశ్వర్ గౌడ్, మండలోజు శ్రీనివాస్, రొట్టె శ్రీధర్, గ్రామ యువకులు మహేష్, మార్గం శ్రీనివాస్, మరిపల్లి వంశీ గౌడ్, సురకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.



## మర్రి జంగి రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి -ఒట్టి కోటి శేఖర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : నాగర్ కర్నూల్ మాజీ శాసన సభ్యులు, మర్రి జనార్దన్ రెడ్డి గారి తండ్రి కీ,శే మర్రి జంగి రెడ్డి మరణించిన విషయాన్ని తెలుసుకున్న నారాయణపూర్ కాంగ్రెస్ మండల నాయకులు ఉప్పల లింగస్వామి, ఒట్టి కోటి శేఖర్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నేరెళ్ల పల్లి స్వగ్రామంలో జంగి రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, జంగి రెడ్డి తో తనకున్న పరిచయాన్ని అతని మంచితనాన్ని గుర్తు చేసుకున్నారు ఉప్పల లింగస్వామి ఒట్టి కోటి శేఖర్



## మాజీ ఎంపీపీ కీ.శే మంచికంటి జనార్ధన్ గారి దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థాన్ నారాయణపురం మండల మాజీ ఎంపీపీ, వాయిల్లపల్లి గ్రామ వాస్తవ్యులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కీ.శే మంచికంటి జనార్ధన్ గారి దశదినకర్మ కార్యక్రమం చౌటుప్పల్ లోని వారి నివాసంలో నిర్వహించగా,ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, నారాయణపూర్ మాజీ సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి హాజరై జనార్ధన్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ ప్రాంతానికి మంచి కంటి జనార్ధన్ చేసిన సేవలను కొనియాడారు. రాచకొండ రవీంద్ర చారి,కొండ గిరిగౌడ్,దర్శనం నర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై నో బెనిఫిట్ షోస్

టికెట్ రేట్ల పెంపునకు అనుమతిస్తామని తెలిపారు. సంధ్య థియేటర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను శనివారం సాయంత్రం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీతేజ్‌కు గొంతులో పైపులు వేసి ఆహారం అందిస్తున్నారని.. ప్రస్తుతం చాలా బలహీనంగా ఉన్నాడన్నారు. అతను కోలుకోవడానికి ఏడాదికిపైగా సముయం పట్టొచ్చని వైద్యులు అంటున్నారన్నారు.బాలుడు కోలుకొనే వరకు ప్రభుత్వం ఆస్పత్రి ఖర్చులు భరిస్తుందని చెప్పారు. 'కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా రూ. 25 లక్షల చెక్కును బాలుడి తండ్రి భాస్కర్‌కు అందించారు. భాస్కర్‌కు ఆత్మస్థైర్యం అందించడంతోపాటు ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పేందుకు సీఎం రేవంత్ ఆదేశాలతో తాను వచ్చినట్లు తెలిపారు. సంధ్య థియేటర్‌కు రావొద్దని పోలీసులు రాతపూర్వకంగా సూచించినప్పటికీ హీరో అల్లు అర్జున్ వచ్చారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొద్దిగా మెరుగుపడినట్లు కిమ్స్ ఆస్పత్రి శనివారం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో తెలిపింది. వెంటిలేటర్ సాయం లేకుండానే అతను శ్వాస తీసుకోగలుగుతున్నాడని పేర్కొంది.




# ఘనంగా 38వ అయ్యప్పస్వామి మహా పడిపూజ మహోత్సవం

దేవరకొండ డిసెంబర్ 21 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో అంగరంగ వైభవంగా 38వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం నాడు దేవరకొండ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టేజిపై అయ్యప్పస్వామి రకరకాల పూలతో పనులతో అలంకరించారు.సుప్రభాతం హెూమం ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం దేవరకొండ పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి అయ్యప్ప స్వామి దేవాలయం వరకు 108 కళాశాల సుగంధ ద్రవ్యాలు దంంతులతో కేరళ సాంప్రదాయ డప్పు మేల వాయిద్యాలతో పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చారు. దేవాలయం లో ఏర్పాటు చేసిన మహా పడిపూజ మహోత్సవాన్ని గురుస్వాములు చంద్రమౌళి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులకు స్వాములు స్వామియే శరణమయ్యప్ప శరణం శరణం అయ్యప్ప అంటూ స్వామి నామ స్వరములతో దేవరకొండ పట్టణం అయ్యప్ప నామ స్వరనతో మార్మోగింది. మీ అయ్యప్ప స్వామి మహా పడిపూజోత్సవంలో వందలాది భక్తులు అయ్యప్ప స్వామి పూజ హాజరై అయ్యప్ప స్వామి నామస్వరులు భజనలతో కీర్తనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మేధావి శ్రీనివాస రామానుజన్ ఆయన జీవితం యువతకు ఆదర్శం

## ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిది డిసెంబర్ 21 : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్లో ఘనంగా జాతీయ ఘన దినోత్సవం జరుపుకున్నారు..ప్రతి సంవత్సరం డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్నాం. అపర మేధావి అయిన శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఈ దినోత్సవాన్ని (నేషనల్ మాదమాటిక్స్ డే ) జరుపుకుంటున్నాం.రామానుజన్ 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఈరోడ్లో జన్మించారు. కఠిక పేదరికాన్ని అనుభవించిన ఆయన ఏనాడూ లెక్కల్ని మాత్రం వదల్లేదు. ప్రతీ క్షణం వాటినే ఆలోచిస్తూ, వాటినే చేస్తూ అవే జీవితంగా మలచుకున్నారు. ఇండియాలో పుట్టిన రామానుజన్ ఆలోచనలు, చేసిన లెక్కలు, వేసిన ఫార్ములాలు అన్నీ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయి. అందుకే గణితశాస్త్రంలో రామానుజన్ సేవలకు గుర్తింపుగా భారత కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని జాతీయ గణిత దినోత్సవం గా ప్రకటించింది. అత్యంత చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో తనకున్న పట్టును చాటుకున్న రామానుజన్ (మాథ్స్ జీనియస్ ) పేరుపొందారు. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు శ్రీనివాస రామానుజన్. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల



మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి గణితంలో తమ ఉత్తమ ప్రదర్శన పరవస్తు రామాంజనేయులు అంత ఎత్తుకు ఎదగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీపీ కృష్ణారావు గణిత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అమిత్‌షా చిత్రపటం దగ్ధం

## అమిత్ షా ను వెంటనే బర్తరఫ్ చేయాలి

## మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు

## అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యలు చేస్తే చెప్పు దెబ్బలు తప్పవు. అంబేద్కర్ నిజంగా దేవుని కంటే ఎక్కువ

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనా రెడ్డి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 21 : పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ పదేపదే అంబేద్కర్ ను ప్రస్తావించడం ఎందుకని ఇంకా వ్యంగ్యంగా అంబేద్కర్ ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని అంబేద్కర్ ను అవమానిస్తే చెప్పు దెబ్బలు తప్పవని అమిత్ షా ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం అంబేద్కర్ పై అమిత్ షా వాక్యాలు నిరసిస్తూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం బ్లాక్, మండల అధ్యక్షులు ఊదరి, నరసింహ ఊదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆందోళన కార్యక్రమం నిర్వహించి నిరసన చేపట్టి అమిత్ షా చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాద శక్తులు మొదటి నుండి భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల దేవుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించడం పనిపాటిగా పెట్టుకున్నారని దేశభక్తుల ముసుగులో ఉన్న దేశద్రోహులు దేశాన్ని పరిపాలిస్తున్నారని దేశాన్ని కులాలు మతాలు ప్రాంతాలు గా విభజించి పాలిస్తున్నారని విచ్చిన్నకర శక్తుల చేతిలో దేశం నలిగిపోతుందని ప్రపంచ దేశాల ముందు భారతదేశ పరువు తీస్తున్నారని ఏకంగా కేంద్ర హెూం శాఖ పదవిలో ఉన్న అమీషా నేరుగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సింది పోయి వారిని అవమానించే విధంగా మాట్లాడడం నిజంగా సిగ్గుచేటు ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని వెంటనే నరేంద్ర మోడీ అమిత్ షాను బర్తరఫ్ చేయాలని, అమిత్ షా వెంటనే ముక్కు నేలకు రాసి జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, కౌన్సిలర్ బొడిగె బాలకృష్ణ, షాది ఖానా చైర్మన్ కరీం, మోగుదాల రమేష్ గౌడ్, ఊదరి వెంకటేష్ మహాజన్, చింతల సాయిలు, బక్క శ్రీనాథ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్, కట్టెల లింగస్వామి, పెద్దగోని రమేష్ గౌడ్, ఆవుల ఏసుదాసు, చెరుకు లింగస్వామి, వీరమల్ల సత్తయ్య గౌడ్, కొంతం బుచ్చిరెడ్డి, ఐత రాజు లింగస్వామి, మాధగోని శేఖర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల రామ్ రెడ్డి, ఎండి ఎజాజ్ దాసరి గణేష్, నెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు



# పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా దారులపై, గంజాయి అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

మిర్యాలగూడ డిసెంబర్ 21:-( వార్త మిర్రర్) : పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల అదుపుకు చర్యలు తీసుకోవడం వల్ల ఆ నేరాలు తగ్గు ముఖం పట్టాయని యాదాద్రి మల్టీ జోన్ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ వి.సత్యనారాయణ అన్నారు. శనివారం శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన అనంతరం ఆయన విలకరుల సమావేశంలో మాట్లాడుతూ పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, విక్రయ దారులపై, గంజాయి అమ్మే వారిపై ఉక్కు పాదం మోపుతున్నామని ఆయన తెలిపారు. గంజాయి ఎపి రాష్ట్రం నుండి తెలంగాణకు, తెలంగాణ నుండి ఏపి రాష్ట్రానికి పిడిఎస్ బియ్యం రవాణా చేసే వారిని అరెస్టు చేసి జైలుకు పంపామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన చెప్పారు. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సైబర్ నేరాల, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి పై 95 శాతం నియంత్రణ సాధించామని ఆయన తెలిపారు. తన జోన్ లోని పోలీస్ స్టేషన్లను అధునాతన సాంకేతిక హంగులతో భవనాలు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. మిర్యాలగూడ రూరల్ పోలీసు స్టేషన్ ను ఇన్స్పెక్టర్ స్థాయి పోలీసు స్టేషన్ గా చేయనున్నామని భవనం కూడా నిర్మించనున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో నల్లగొండ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్, డిఎస్పి కె. రాజశేఖర్ రాజు ఉన్నారు.



# ఢిల్లీలో తెలుగు ఎంప్లాయిస్ కోసం ఉపేంద్రగాడి అడ్డా.. స్పెషల్ షో

విశాఖపట్నం వార్త మిర్రర్ : ఢిల్లీలోని తెలుగు ఉద్యోగుల కోసం ఏపీటిఎస్ భవన్ లో సమైఖ్య తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో ఉపేంద్రగాడి అడ్డా మూవీ స్పెషల్ షో ప్రదర్శిస్తున్నట్టు ప్రముఖ సినిమా నిర్మాత, ఉపకార్ ట్రస్టు చైర్మన్, ఏపీ ఫిల్మ్ ఫెడరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు, టిడిపి నాయకులు డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విశాఖ, ఢిల్లీలలోని మీడియాకి ప్రకటన విడుదల చేశారు. దేశ రాజధానిలో తెలుగు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఈ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఢిల్లీలోని ఉద్యోగులు కుటుంబాలతో సహా తరలి వచ్చి వీక్షించాలని కోరారు. తెలుగు ఉద్యోగుల అభ్యర్థన మేరకు సినిమా ప్రదర్శించడానికి ఏపీటిఎస్ భవన్ లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు వివరించారు. ఢిల్లీలోని తెలుగు వారికోసం.. సినీహీరో ఉపేంద్రబాబు నటించిన సినిమా దేశరాజధానిలో స్పెషల్ షో వేస్తుండటం పట్ల ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని.. ఢిల్లీలోని ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా చేసిన ఈ ఏర్పాటుతో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నట్టు డా.కంచర్ల స్పష్టం చేశారు. సినిమా నిర్మాణం నుంచి ప్రత్యేక ప్రదర్శనలు, అన్నివర్గాల ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లే విషయంలో ఎక్కడా రాజీలేకుండా వడి వడిగా అడుగులు వేస్తున్నట్టు డా.కంచర్ల అచ్యుతరావు వివరించారు.



# ఓయూలో కృతజ్ఞత బహిరంగ సభకు మంచి స్పందన

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 21.... కృతజ్ఞతా బహిరంగ సభను టీపీసీసీ అధికార ప్రతినిధి,ఓయూ విద్యార్థి నాయకుడు చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,మాజీ ఎంపీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్,గ్రంధాలయ చైర్మన్ రియాజ్,ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్,ప్రజా కళాకారుడు ఏపూరి సోమన్న,ఓయూ అధ్యక్షుడు మెడ శ్రీనివాస్,రంజిత్, వినయ్, ఓంకార్, పవన్, రవి,మోహన్ ఇతర విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

## ప్రతి కుటుంబానికి 20 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలి

## దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దేవరకొండ డిసెంబర్ 21 వార్త మిర్రర్ : దేవరకొండలోని పెద్ద దర్గా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతులు మహ్మద్ హాజీమియా , నబీనా,అబ్దుల్ ఖాదర్ కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల మహ్మద్ హాజీమియా , నబీనా,అబ్దుల్ ఖాదర్ కుటుంబాలను మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......ప్రతి కుటుంబానికి 20 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలి ఆయన డిమాండ్.వారి మరణం బాధాకరమని ఆయన అన్నారు.వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బొడ్డు గోపాల్ గౌడ్, రమావత్ తులిసిరాం,సయ్యద్, మైబెల్లి,అఫ్రోజ్, బాబా,రియజ్,తదితరులు ఉన్నారు.



# ఎస్సీఈఆర్టీ తెలంగాణ విద్యాప్రవేశ్ బి2 మూల్యాంకనం పూర్తి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 21 : విద్యాప్రవేశ్‌బి2మూల్యాంకనంలో భాగంగా గత రెండు రోజుల నుండి నిర్వహిస్తున్న సర్వే శనివారం తో పూర్తి అయిందని డీ.ఈ.వో శ్రీ కే. రాము తెలిపారు. శనివారం ఉదయం రాయికల్ మండలం లోని భూపతిపూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు జి. సత్యనారాయణ, కే .వినోద్ కుమార్ పలు అంశాలలో ఇంటర్వ్యూ చేసి ఒకటవ తరగతిలో రాండముగా సెలెక్ట్ చేసిన 8 మంది విద్యార్థులకు వివిధ అంశాలపై మూల్యాంకనం చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమము ఒకటవ తరగతి విద్యార్థులకు వారి అంతర్గత శక్తులను వెలికి తీయడానికి ఎంతో ఉపయోగపడుతుందని మరియు గుణాత్మక విద్యను అందించడానికి తోడ్పడుతుందని జిల్లా విద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, సెక్టోరియల్ అధికారి కే.రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వేణుగోపాల్, ఉపాధ్యాయులు గుర్రం మారుతి, జె.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# సాగర్ నగర్ లో మాజీ ముఖ్య మంత్రి వర్యులు వై యస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాఖపట్నం వార్త మిర్రర్ భీమిలి నియోజక వర్గం జీవీఎంసీ 8వ వార్డు పరిధి లో గల సాగర్ నగర్ బీచ్ రోడ్డు హాచ్ వద్ద ఉన్న వైస్సార్ విగ్రహం దగ్గర ఈ రోజు ఉదయం వైస్సార్సీపీ వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి ఆధర్యం లో వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి వర్యులు వై యస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకే కట్ చేసి జగనన్నకు బర్త్డే విషెస్ తెలియజేశారు. ఈ కార్య క్రమము లో వైస్సార్సీపీ సీనియర్ నాయకులు అల్లాడ ఉమామహేశ్వర్ రావు ,సారిపల్లి అప్పలరాజు ,పిల్లల రాజు ,గుంట బాల కృష్ణ ,సత్యం ,నాగభూషణ్ , నాయుడు , మురళి ,శ్రీనివాస్ ,రమణ మూర్తి ,రాజేష్ ,చిన్న ,పోలినాయుడు ,రామునాయుడు ,అప్పలరాజు ,వాసు ,గోవింద్ ,పవన్ ,శ్రీనివాస్ రెడ్డి ,నూకరాజు ,నరసిములు, శ్రీనివాస్ రెడ్డి ,శివ , రాంబాబు , రాజు ,బాలు ,అప్పల రాము ,ఉమా ,రాంబాబు ,వెంకట్ ,లక్ష్మి ,మరియు వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘోర రోడ్డు ప్రమాదం

### నిలబడిన వారిపై దూసుకెళ్లిన డీసీఎం అక్కడికక్కడే ముగ్గురు మృతి



దేవరకొండ డిసెంబర్ 21 వార్త మిర్రర్ : తెల్లవారితే బతుకులు చక్కగా ఉండాలని ఆ అల్లా ఆశీస్సులు తమపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్న యధావిధిగా ఇంటికి వెళ్దాం అన్న సన్నద్ధంలో వారిని మినీ లారీ రూపంలో అల్లా సాక్షిగా మృత్యువు కబాలించింది. పూర్తి వివరాలకు వెళ్తే దేవరకొండ పట్టణంలోని హ్జ్రాత్ హాజీ హఫెజ్ మొహమ్మద్ దుర్వేష్ ఖాద్రి ఖాదర్ షా వలి దర్గా వద్దా ప్రతి ఏటా నిర్వహించే ఉర్సు ఉత్సవాలు శుక్రవారం నాడు తెల్లవారుజామున 3:00 వరకు ముస్లిం సోదర సోదరీమణులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ ఊర్సు ఉత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల నుండి ముస్లిం సోదరి సోదరులు దర్గాలోని ఉర్సు ఉత్సవాల్లో పాల్గొంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో అల్లాను స్మరించుకుంటూ ఈ ఉర్సు ఉత్సవాలను జరపడం ఆనవాయితి. పండుగ వాతావరణం లో ఉన్న అందరికీ శనివారం నాడు అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి సాక్షిగా దర్గా సమీపంలో తమ ఊర్లకు వెలుదామన్న సమయంలో కొండమల్లేపల్లి నుండి కల్వకుర్తి వెళ్తున్న డీసీఎం వాహనం నిలబడిన ఒక్కసారిగా వారిపై దూసుకెళ్లింది. కళ్ళు మూసి తెరిచే లోపే ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలతో పాటు కాలు కూడా విరిగినట్టు వైద్యులు తెలిపారు. మృతి చెందిన వారిలో దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి




చెందిన హాజీమియా (56) పెద్ద దర్గా వద్ద కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటారు. మృతి చెందిన వారిలో తాండూరు మండలం మేడి పూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ (23) డిండి మండలం ఎర్రారం గ్రామానికి చెందిన మహమ్మద్ నబినా (35) లుగా గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని వాహన డ్రైవర్ను స్థానికులు పట్టుకొని పోలీస్ స్టేషన్లో చెప్పారు.. పండగపూట దర్గా సమీపంలో నిశ్శబ్ద వాతావరణం చోటుచేసుకుంది..

# కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను బర్తరఫ్ చెయ్యాలి

### దళిత సంఘాల నాయకులు డిమాండ్ బోయ రామచందర్, బోయ దేవేందర్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 21 : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానిస్తూ పార్లమెంట్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడటాన్ని నిరసిస్తూ చౌటుప్పల్ మున్సిపాలిటీ వలిగొండ రోడ్డు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దళిత సంఘాల సీనియర్ నాయకులు బోయ రామచంద్రం మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. డా.బి.ఆర్. అంబేద్కర్ నే అవమానించడం ఒక సిగ్గుమాలిన చర్య అని అవమానకరంగా మాట్లాడిన అమిత్షా ను కేంద్రమంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ మనువాద ప్రేమికుడినని నిరూపించుకున్న అమిత్ షా ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పలి. బీజేపీ ప్రభుత్వం గత కొన్ని సం.రాలుగా భారత రాజ్యాంగాన్ని మార్చేయడానికి కుట్రలు చేస్తుందని, ఆ కుట్రలో భాగంగానే నిన్న అమిత్ షా పార్లమెంట్ లో అంబేద్కర్ ని అవమానిస్తూ మాట్లాడడం జరిగిందని ఆయన అన్నారు. దేశ ప్రజలు ఈ మనువాద పాలకుల కుట్రలను ఐక్య పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఊదరి వెంకట్ మహాజన్, బోయ లింగస్వామి, ఊదరి నర్సింహ, కట్టెల లింగస్వామి, ఆరుట్ల లింగస్వామి, కాకి సుందర్, ఊదరి శ్యామ్ సుందర్, ఎర్ర శంకర్, ఊదరి శ్రీనివాస్, పుర్రు యాదయ్య, పాపగళ్ల లింగస్వామి, పుర్రు శంకరయ్య, గ్యార సుధాకర్, మీసాల మల్లయ్య, సరిపల్లి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి స్కూల్లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

శంకర్పల్లి , డిసెంబర్:21:(వార్త మిర్రర్) : దిగ్గజ భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజున మేధావి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 1887 తమిళనాడులోని తమిళ బ్రాహ్మణ అయ్యంగార్ కుటుంబంలో జన్మించారు. డిసెంబర్ 22న దేశవ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ఈ జాతీయ గణిత దినోత్సవం గా జరుపుకుంటారు. శంకర్పల్లి మునిసిపల్ పరిధి భవాని నగర్ కాలనీ కృష్ణవేణి స్కూల్లో శనివారం భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం డిసెంబర్ 22న(1729) గణిత శాస్త్ర దినోత్సవాన్ని జరుపుకుంటాము. డిసెంబర్ 22 ఆదివారం సెలవు దినం కావడంతో ముందస్తుగా డిసెంబర్ 21న పాఠశాలలో 250 కి పైగా గణిత పరికరాలతో ప్రదర్శన అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ మహమ్మద్ జాకీర్ అహ్మద్, ప్రిన్సిపల్ పాండేశ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత బెజగం రాజు, చంద్రకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గణితం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిది గణిత శాస్త్రం లేకుండా ఈనాడు ప్రపంచం ఏ రంగంలోనూ ముందంజ వేయలేదు. సమస్యల పరిష్కారానికి గణితం ఎంతో ఉపయోగపడింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎక్కడ పరిశోధనలకు గణితమే ప్రాతినిధ్యం వహిస్తుంది గణితం కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిగ్ డేటా మిషన్ లెర్నింగ్ సైబర్ భద్రత క్రిప్టోగ్రఫీ వంటి వివిధ రంగాలలో కొత్త పరిశోధనలకు సమస్య పరిష్కారానికి గణితమే ప్రధానం గణితంతో సమస్యలను అధిగమించి పరిష్కరించి అన్ని సాంకేతిక రంగాలలో వినూత్న మార్పులు, శాస్త్రజ్ఞులు తేవడం జరిగింది



అని, శ్రీనివాస రామానుజన్ మొదటిగా కనుగొన్న నంబర్ 1729 గా ప్రధానోపాధ్యాయులు పాండేష్ కుమార్ వివరించారు. ప్రపంచంలో గణితం నిరంతరం మారుతున్న రంగాలలో వ్యాపారాలు ప్రభుత్వాలు తమ నిర్ణయాలు తీసుకోవడానికి గణిత నైపుణ్యం పై ఆధారపడతాయి. ఆధునిక ప్రపంచంలో గణిత నైపుణ్యం అత్యంత సాధారణ అనువర్తనాలు వ్యాపారం ఆర్థిక ఇంజనీరింగ్ లో ఉన్నాయి. వ్యాపారంలో ఆర్థిక నిష్పత్తులు ప్రకటనలను లెక్కించటానికి సమాచారం విశ్లేషించడానికి భవిష్యత్తు ఆర్థిక ధోరణులను అంచనా వేయడానికి గణిత నైపుణ్యాన్ని ఉపయోగిస్తారు. ప్రపంచంలో అందరూ ఏదో ఒక రూపంలో గణితం తమ జీవితాలలో వాడడం జరుగుతుందని పేర్కొన్నారు.

# ప్రజల కోరుకొనే నేత వైఎస్ జగన్

### దక్షిణంలో ఘనంగా జగనన్న జన్మదిన వేడుకలు

### పలు సేవా కార్యక్రమాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం వార్త మిర్రర్ : పేద ప్రజల గుండెచప్పుడు వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు దక్షిణ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. వార్డుల వారీగా జరిగిన వైయస్. జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల కేక్ కటింగ్ కార్యక్రమానికి మాజీ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వాసుపల్లి గణేష్కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలు ప్రారంభించారు. ఆయనతోపాటు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ పాల్గొని పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 33వ వార్డ్ అల్లిపురంలో వైసిపి వార్డు అధ్యక్షుడు ముత్తా బత్తుల రమేష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. 35వ వార్డులో వార్డు అధ్యక్షుడు కనకారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ జరిగింది. అలాగే 29 వ వార్డులో వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. 37 వార్డులో కార్పొరేటర్ జానకిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న జన్మదిన వేడుకలకు వాసుపల్లి హాజరై వృద్ధులకు పండ్లు చీరలు అందజేశారు. అనంతరం. ఆశలు మెట్ట కార్యాలయంలో దక్షిణ వైసీపీ శ్రేణులు కార్పొరేటర్లతో కలిసి ఘనంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం 41వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైసిపి క్లస్టర్ ఇంచార్జ్ కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ అనంతరం 500 మంది కార్యకర్తలకు పేదలకు, చిన్నారులకు చీరలు, చాక్లెట్ బాక్సులు, వస్త్రాలు వాసుపల్లి చేతుల మీదుగా పంపిణీ చేశారు. 34 వ వార్డ్ కొబ్బరి తోట వైయస్సార్ విగ్రహం వద్ద కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ కార్యక్రమానికి వాసుపల్లి హాజరై కేక్ కటింగ్ అనంతరం వృద్ధులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు వైయస్ జగన్ అధికారంలో లేని లోటు పేదల ఇంట్లో స్పష్టంగా కనబడుతుంది అన్నారు. ఆయన అధికారంలో ఉండి ఉంటే పేదలకు నేరుగా వివిధ పథకాలు 70 వేల కోట్ల రూపాయలు ఈరోజుకి అందేవని అన్నారు. కానీ అమ్మ ఒడి నుండి ఆటో డ్రైవర్ల కార్మికుల వరకు పండగలవు కూడా డీలపడ్డారన్నారు. కుతంత్ర రాజకీయాలతో అధికారంలో కూర్చున్న కూటమి ప్రభుత్వం నమ్మి ఓటు వేసిన పేద ప్రజలకు నిలువుల ముంచిందని వాసుపల్లి గణేష్ కుమార్ విమర్శించారు. ప్రజలు కోరుకునే విధంగా జగన్మోహన్ రెడ్డి మబ్బుల వీడిన సూర్యుడిలా పేద ప్రజలకు మళ్ళీ అధికారంలోకి వచ్చి వెలుగునిస్తారని వాసుపల్లి గణేష్ కుమార్, ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ వైఎస్ఆర్సిపి నాయకులు దశమంతుల మాణిక్యాలు, మైకిల్ రాజు, బేశెట్టి ప్రసాద్,డేవిడ్ రాజ్, వేణుగోపాల్,బాలు,లింగం శ్రీను,చైర్మన్ లండ రమణ, వద్దాది దిలీప్, వైట్, ముజీబ్ ఖాన్,కోన శంకర్,మాజీ డైరెక్టర్ సనపల భారత్ ,మాజీ డైరెక్టర్ ప్రసాద్,తాడి రవి తేజ, భేవర మహేష్,వాసుపల్లి భారతి,ఆకుల శ్యామ్,కోరాడ సురేష్,దైవ కుమార్,కార్యకర్తలు, మహిళా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర నగర్ కాలనీలో లక్ష్మీ నరసయ్య సంస్మరణ సభ

కాప్రా,వార్త మిర్రర్,డిసెంబర్ 21:శ్రీ షిరిడి సాయిబాబా సంస్థ వెంకటేశ్వర నగర్ మౌలాలి వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు సముద్రాల లక్ష్మీ నరసయ్య సంస్మరణ సభను నిర్వహించారు.శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయ నిర్మాణంలో సముద్రాల లక్ష్మీ నరసయ్య కీలకపాత్ర పోషించారని కొనియాడారు.కైలాసగిరి మల్లికార్జున స్వామి దేవస్థానం,శ్రీ శిరిడి సాయిబాబా సంస్థాన్ వెంకటేష్ నగర్ దేవాలయాలకు ఫౌండర్ మెంబర్,ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులుగా ఎన్నో సేవలు అందించారు.కీర్తిశేషులు సముద్రాల లక్ష్మీ నరసయ్య అనంతరం ఆయన నేత్రాలను ఎల్వి ప్రసాద్ ఐ ఆస్పత్రికి డొనేట్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నాదం చారి,రామచంద్ర రెడ్డి, పాండు,వీరభద్రరావు,రాజారావు,రమాదేవి, సత్యనారాయణ, నాగయ్య, విజయలక్ష్మి, సూర్య ప్రకాష్, సురేష్,సుధాకర్,బ్రహ్మచారి,రామ శర్మ, శ్రీనివాసరావు, అనిల్,సముద్రాల లక్ష్మీ నరసయ్య కుమారులు సముద్రాల కృష్ణమూర్తి, సముద్రాల శివకుమార్లు పాల్గొని నివాళులర్పించారు.




## వీరాపూర్ పాఠశాలకు ఆర్వో వాటర్ ఫిల్టర్ అందజేత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 21 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సురక్షితమైన మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కన్నవేని మల్లారెడ్డి కుమారుడు రిషిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలకు రూ.10వేలు విలువ గల ఆర్వో ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్ ను శనివారం బహుకరించి వారి ఉధారతను చాటుకున్నారు. మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, గ్రామస్తులతో కలిసి వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాఘవులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, గ్రామంలోని విద్యార్థులను పాఠశాలలో చేర్పించి ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయడం వల్ల పాఠశాల అద్భుతంగా మారిందని వారి సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రాజమణి, గంగాధర్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామానికి చెందిన డీఎస్సీ 2024 ఎస్జీటీ ఉపాధ్యాయులుగా కొలువు సాధించిన దొమ్మటి వెంకటేష్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కన్నవేని రిషిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేయడంతో గ్రామస్తులు ఆయనకు ధన్యవాదాలు తెలిపి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ నీలి చిన్నమల్లయ్య, మాజీ ఎంపీటీసి కిషన్ రావు, మాజీ ఉప సర్పంచ్ మహబూబ్, ఉప్పుమడుగు ప్యాక్స్ వైస్ చైర్మన్ దుంపల స్వామిరెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు మదన్మోహన్ రావు, నాయకులు ఇబ్రహీం, మహిపాల్, దిండిగాల రాజేష్, నీలి మధు, స్వశక్తి మహిళా సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం హోం మంత్రి అమిత్ షా ను బర్తరఫ్ చెయ్యాలి యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎర్ర కృష్ణ జాంభవ్



దేవరకొండ డిసెంబర్ 21 వార్త మిర్రర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు లో అవమానించిన అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎర్ర కృష్ణ జాంభవ్ ఒక ప్రకటన లో తెలిపారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ హోం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగం ద్వారా హక్కుల పొందుతున్న ప్రతి భారతీయ పౌరునికి తక్షణమే క్షమాపణ చెప్పాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగమే లేకుంటే నీకు హోం మంత్రి పదవి ఎక్కడిదని అన్నారు మణిపూర్ రాష్ట్రం అల్లర్లతో అట్టుడికి పోతూ ప్రాణం నష్టం జరుగుతుంటే చోద్యం చూస్తూ అల్లర్లను ఆపలేని చేతగాని హోం మంత్రి అమిత్ షా మరియు బిజెపి పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతగాని పరిపాలనకు నిదర్శనం అని అన్నారు బడుగు బలహీన వర్గాల ప్రజలకు అంబేద్కర్ వారసులను చిచ్చులు పెట్టి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారన్నారు భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా బాబాసాహెబ్ అంబేద్కర్ ని అగౌరవపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు భారత రాజ్యాంగాన్ని పట్టుకొని దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.



## ఈ నెల 23న ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ విందు ::: సబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ , డిసెంబర్ 21:-( వార్త మిర్రర్): రాష్ట్ర ప్రభుత్వ పరంగా క్రిస్మస్ వేడుకలను ఈ నెల 23న ఏఆర్సి గార్డెన్స్ లో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన చర్చిల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమన్వయంతో క్రిస్మస్ విందు నిర్వహించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డిఏఓ శ్రీనివాస శర్మ, తహసీల్దార్లు ఎన్.హరిబాబు, జవహర్, సురేష్, పద్మ, కమిటీల బాధ్యులు ముండ్లగిరి కాంతయ్య, కెఎస్. విక్టర్, సంపత్? పెయ్యాల ప్రసాద్, బాబుజాన్, ఎలీషా, సామ్యూల్ పాల్గొన్నారు.



## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే: శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి , డిసెంబర్:21:(వార్త మిర్రర్) : ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణ పరిధి 2,15 వార్డులలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపా ట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెలాఖరులోగా ప్రణాళికాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయ నుందన్నారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## లక్ష్మీపూర్ ప్రాథమికోన్నత పాఠశాలో ఆహార వారోత్సవాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 21 జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఆహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అందు బాటులో ఉన్న పదార్థాల తో పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేసుకోవడం జరిగింది. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్ణచందర్ మాట్లాడుతూ మనం తినే ఆహార పదార్థాలలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు విటమిన్లు ఖనిజాలు, లవణాలు, పీచు పదార్థాలు ఉండాలి అని చూచించారు. అనంతరం భారత గణిత శాస్త్ర పితామహుడు శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా గణిత దినోత్సవ%శీ% నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల గణిత నమూనాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల ను మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవిందుల లావణ్య- జలపతి అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయూలు పూర్ణచందర్, రమేష్, రూహినా యస్మిన్, గాయిత్రి, దుర్గాదేవి, శ్రీలత, విద్యార్థుల తల్లి తండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## భూపాతిపూర్ పాఠశాలలో ముందస్తు గణిత దినోత్సవము

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 21 : గణిత దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ లో శనివారం రోజున శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ముందస్తు గణిత దినోత్సవము ను నిర్వహించడం జరిగినది. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను పాఠశాలలో ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహం గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, గణిత ఉపాధ్యాయులు సిరిపురం మహేష్, ఉపాధ్యాయులు పులిశెట్టి సంజయ్ కుమార్, తాటిపెల్లి వేణుగోపాల్, ఎండీ ఖమారుద్దీన్, కూరగాయల సురేష్, పళ్లెం భవాని, గాలి పుష్పలత, పోచంపల్లి సరోజన, చింత శైలజ పాల్గొన్నారు.




## శంకర్‌పల్లి రేవతి హై స్కూల్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శంకర్‌పల్లి , డిసెంబర్:21:(వార్త మిర్రర్) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేవతి హైస్కూల్లో శనివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను కరస్పాండెంట్ శ్రీనివాస్ అభినందించారు. అకాడమిక్ డైరెక్టర్ పావని మాట్లాడుతూ ఏసుక్రీస్తు అందరివాడన్నారు. సమాజ శ్రేయస్సు కోసమే ఏసుక్రీస్తు కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, జ్యోత్స్నశ్రీ, ఇన్చార్జ్ అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మన్మర్రి పాఠశాలలో తెలంగాణ ఆహార మహోత్సవం

శంకర్‌పల్లి, డిసెంబర్:21:(వార్త మిర్రర్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం శనివారం షాబాద్ మండల ప్రాథమిక పాఠశాల మన్మరిలో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఇంటి దగ్గర తయారు చేసుకొని తెచ్చిన వివిధ రకాల పిండి పదార్థాల, మాంసకృతుల, పీచు పదార్థాల, విటమిన్ల పోషక విలువలు గల ఆహార పదార్థాలు, కూరగాయలు ఆకుకూరలు, పండ్లు, పాలు, పెరుగు తదితర తినుబండారాలను పాఠశాలలో ప్రదర్శించడం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు అనురాధ ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మరియు మానసిక అభివృద్ధి కోసం ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు అందించాలని, అందులో ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు, పిండి పదార్థాలు, మాంసకృతులు గల ఆహారాన్ని అందించాలని తెలిపారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరగాలంటే ప్రతి రోజు ఉడికించిన కోడిగుడ్డు, పాలు, పెరుగు, మాంసకుతులకు సంబంధించిన ఆహార పదార్థాలను పెట్టాలని, వీదుల్లో దొరికే లేస్, కుర్కురే, మాగీ, నూడుల్స్, మంచూరియా, ఫిజ్జా, బర్గర్ తదితర జంక్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలు ఆహారాన్ని తీసుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో గాని, డెటాల్ తో గాని కడుకోవాలని కోరారు. విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కి గురి కాకుండా వంట చేసేటప్పుడు ఇంటిదగ్గర గాని, పాఠశాలల్లో గాని వంట పాత్రలు శుభ్రంగా కడగాలని, అదే విధంగా



కూరగాయలు మంచి నీటితో శుభ్రం చేయాలని, వండిన ఆహారంపై సరిపడా మూతలు పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శంకర్, రవి, మల్లేష్, యాదయ్య, నరసింహులు, మమత, వెంకటేశ్వరి, యాదమ్మ, నాజియా, నూరిన్ పాల్గొన్నారు.

# లిటిల్ స్టార్ హై స్కూల్ లో ఘనంగా జాతీయ మ్యాథ్స్ డే వేడుకలు

శంకర్‌పల్లి, డిసెంబర్:21:(వార్త మిర్రర్) : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని లిటిల్ స్టార్స్ హై స్కూల్ లో జాతీయ మ్యాథ్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్సై తుకారాం హాజరై మాట్లాడుతూ ఉద్దండులే పరిష్కరించలేని గణిత సమస్యలను తన అపార మేధా సంపత్తితో చిటికెలోనే పరిష్కరించి వారి నుంచి ప్రశంసలందుకున్నారు శ్రీనివాస్ రామానుజన్ అని కొనియాడారు. కరస్పాండెంట్ సంజీత్ కుమార్ మాట్లాడుతూ అందుకే ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం అని తెలియజేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రామానుజన్ గణితంపై ఎక్కువ శ్రద్ధ పెట్టడంతో ఎఫ్ఏ పరీక్షల్లో తప్పారు. తన మేధతో క్లిష్టమైన గణిత సూత్రాలను అవలీలగా చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కించుకున్నారు. రామానుజన్‌లోని ప్రతిభను బయటకు తీసింది మాత్రం జీఎస్ కార్ రచించిన గణిత పుస్తకం. సర్వశాస్త్రాలకు తల్లివంటిది గణితం, అటువంటి గణితశాస్త్రానికి పుట్టిల్లు భారతదేశము. మిగిలిన ప్రపంచములో విజ్ఞానశాస్త్రము ఉదయించకముందే ఇక్కడ మహాపురుషులు ఖగోళశాస్త్రాన్ని అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్ళారు. కాల గమనము, గ్రహణాల అంచనాలు, పంచాంగ నిర్మాణము వంటివన్నీ వారి ప్రతిభకు నిదర్శనము. అంకెలు కనుగొన్నది, గణితంలో కీలకమైన సున్నాని కనుగొన్నది




భారతీయులే అని, భారతీయుల గణిత వేత్తల ఘనతను పిల్లలకు గుర్తు చేశారు. అనంతరం మాథ్స్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంజిత్ కుమార్ గారు, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్వాస మీద ధ్యాసే ధ్యానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 21 : అలసిన మనసు కన్నా ప్రశాంతత ఉన్న మనసు చురుకుగా పని చేస్తుందని ఓషో ధ్యాన మగ్నో అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల శివారులో గల నివేదిత కృష్ణారావు పిరమిడ్ క్షేత్రంలో ఓషో ధ్యాన మాగ్నో ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అదే విధంగా ఓషో ధ్యాన పద్ధతులను పరిచయం చేస్తూ ఒకరోజు ధ్యాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన శిక్షకులు మాగ్నో మాట్లాడుతూ... ప్రతిరోజు కొన్ని నిమిషాలైనా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తే అది మనం కోరుకున్న విధంగా మనల్ని మనం మలుచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.రోజులో అరగంట పాటైన ధ్యానం చేయడం శ్రేయస్కరమన్నారు. శ్వాస మీద ధ్యాసే ధ్యానమని, ధ్యానం చేయడం ద్వారానే ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతులుగా ఉంటారని అన్నారు. ధ్యానం వ్యక్తిగత వికాసానికి తోడ్పడే ఏకైక సాధనమని ఓషో ధ్యాన పద్ధతులు ఇందుకు తోడ్పడు తాయని తెలిపారు. మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, అనుపురం నాగేశ్వర్ గౌడ్, మండలోజు శ్రీనివాస్, రొట్టె శ్రీధర్, గ్రామ యువకులు మహేష్, మార్గం శ్రీనివాస్, మరిపల్లి వంశీ గౌడ్, సురకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.





## నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్ సమర్థవంతకంగా పనిచేసి డిపార్ట్మెంట్ పేరు తేవాలి: ఐజి సత్యనారాయణ

మిర్యాలగూడ డిసెంబర్ 21:- (వార్తమిర్రర్) : యాదాద్రి మల్టీ జోన్ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సత్యనారాయణకు మిర్యాలగూడ రూరల్ పోలీసు స్టేషన్లో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు ఘనస్వాగతం పలికారు. సాయుధ పోలీసు దళం, రూరల్ పోలీసులు వందన సమర్పణ చేశారు. వారిలో విధుల్లో చేరిన కానిస్టేబుల్స్ ను వారి విద్యార్హతలు అడగ్గా ఒకరు ఎల్ఎల్ఎం, మరొకరు బిటెక్, ఎంటెక్, మహిళా బిఎస్సి మరి కొంత మంది పిజి, డిగ్రీ, బిఎడ్ అని పేర్కొన్నారు. నూతనంగా విధుల్లో చేరిన వారు సమర్థవంతంగా పని చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పోలీసు కానిస్టేబుల్లకు పంపిణీ చేసిన యూనిఫాం, చలికోటు, బూట్లు, సాక్స్, మ్యాట్ లను పరిశీలించారు. వీటిని వాడుతున్నారా అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళ గస్తీ తిరిగే సమయంలో కోటు వేసుకోవాలని కోరారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ అనంతరం వాడపల్లి పోలీస్ స్టేషన్, ఇరు రాష్ట్రాల చెక్ పోస్టులను తనిఖీ చేశారు. పని మరింత మెరుగు పరచడానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ఇన్స్పెక్టర్లు కె.వీరబాబు, కోట కరుణాకర్, ఎస్ఐలు పి. లోకేష్, కృష్ణయ్య, శేఖర్, ఎఎస్ఐ ఉమాపతిలున్నారు.



## నేడు మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి అంకిత గౌడ్ రాక నిర్వాహకులుడైమండ్ శ్రీనివాస్

మిర్యాలగూడ, డిసెంబర్ 21:- (వార్తమిర్రర్) : డైమండ్ చెస్ అకాడమీ నిర్వాహకులు, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ ఆధ్వర్యంలో ఈనెల 22న ఆదివారం ఉదయం 9-00 గంటలకు ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, మాశెట్టి గీత తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు డైమండ్ శ్రీనివాస్, చెస్ క్రీడాకారిణి దివ్యశ్రీ లు మాట్లాడుతూ జిల్లాస్థాయి అండర్ -19 చెస్ పోటీలు ఈనెల 22న మిర్యాలగూడ పట్టణంలోని ఐఎంఏ బిల్డింగ్ జరగనున్న చెస్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి అంకిత గౌడ్ మిర్యాలగూడకు విచ్చేసారని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేయించుకున్నారని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత భోజన సౌకర్యం నిర్వాహకులు కల్పిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ లో పాల్గొనబోయే అండర్-7, అండర్-9, అండర్-11, అండర్- 13, అండర్-15, అండర్-17, అండర్-19, బాల, బాలికల చెస్ క్రీడాకారులకు వేర్వేరుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. బాలికలకు 23 బహుమతులు బాలురులకు 23 బహుమతులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

## అబాకస్ అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన తార్నాక విద్యార్థులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 21 : హైదరాబాద్ తార్నాక అబాకస్ (యుసి మస్) సెంటర్ విద్యార్థులు అస్లేష, లేఖ్య శ్రీ, కృష్ణ సాత్విక్ లు అబాకస్ అంతర్జాతీయ పోటీ ల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ అబాకస్, మెంటల్ ఆర్థమెటిక్ పోటీలలో దాదాపు 30 దేశాల నుండి 6000 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో తార్నాక సెంటర్ కు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ కేటగిరి ఇలలో అంతర్జాతీయ అబాకస్ పోటీలలో




పాల్గొని అవార్డు గెలుపొందారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. తమ పిల్లలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన తార్నాక అబాకస్ సెంటర్ ఇన్చార్జి శోభారాణి కి విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.



## రజక ఆత్మగౌరవ భవన్ ఏర్పాటు కోసం సీఎంను కలిసిన రజక సంఘం ప్రతినిధులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 21.... తెలంగాణ రజక ఆత్మగౌరవ భవనం కోసం సీఎంను రజక సంఘం ప్రతినిధులు కలిశారు. తెలంగాణ అసెంబ్లీ లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యం లో సీఎం రేవత్ రెడ్డి ని కలిసి రజక ఆత్మగౌరవ భవన్ నీ ఉప్పల్ భాగాయత్ లో 3 ఎకరాలలో నిర్మించాలని కోరడం జరిగింది.ముఖ్యమంత్రి వెంటనే స్పందిస్తూ సీఎస్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే రజక భవన్ శంకుస్థాపన చేస్తానని ఎమ్మెల్సీ, కొన్నే సంపత్ దుబ్బాక రమేష్ చెప్పడం జరిగింది. అందరం కలిసి త్వరలోనే ఉప్పల్ బాగయత్ లో భావన నిర్మాణం అయ్యేవిధంగా కృషి చేయాలని కోరుకుంటున్నట్లు రజక సంఘాల సమన్వయ కమిటీ స్టేట్ కన్వీనర్ కొన్నే సంపత్ రజక పేర్కొన్నారు.